## 'పొట్టి శ్రీరాములు'పేరును కొనసాగించాలి

**మంత్రి కొండా సురేఖకు విన్నవించిన ఆర్యవైశ్యులు**

సిద్దిపేట టౌన్,సెప్టెంబర్ 25 : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును యథావిధిగానే కొనసాగించాలని కోరుతూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖకు తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు బుధవారం సిద్దిపేటలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి గంప శ్రీనివాస్, కార్యవర్గ సభ్యుడు అయిత రత్నాకర్, జిల్లా అధ్యక్షుడు కాంచం నవీన్‌కుమార్, గంప మహేందర్ మాట్లాడారు. ప్రభుత్వం విశ్వవిద్యాలయం పేరును మార్చడంతో రెండు తెలుగు రాష్ట్రాల ఆర్యవైశ్యల, ప్రజల మనోభావాలు దెబ్బతింటున్నాయని పేరు మార్చకుండా విశ్వవిద్యాలయాన్ని అలాగే కొనసాగించాలని విన్నవించారు.


మంత్రి కొండా సురేఖకు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు

## బడికి పోవాలంటే బెత్తం పట్టాల్సిందే..

కొమురవెల్లి, సెప్టెంబర్ 25 : బడికి పోవాలంటే పలక, బలుపం, లేదా పుస్తకాలు పట్టాలి కానీ కొమురవెల్లి మండలంలోని కిష్టంపేటలో బడికి పోవాలంటే ముందు బెత్తం ఉండాల్సిందే.. కిష్టంపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గతంలో హరితహారం కింద నాటిన మొక్కలు ఏపుగా పెరుగడంతో గ్రామంలోని కోతుల మంద ఆచెట్లపై మెట్ట పెట్టి పాఠశాలలోకి వచ్చే వారిపై దాడికి పాల్పడుతున్నాయి. దీంతో పుస్తకాలు తర్వాత కానీ బడిలోకి పోవాలంటే మాత్రం బెత్తం తప్పని సరి ఉండాలి. అంతేగాక ఒక్కరూ కాకుండా ఇద్దరు, ముగ్గురు ఉంటేనే కోతులు దూరంగా వెళ్తున్నాయి. దీంతో పాఠశాలకు తమ పిల్లలను తల్లిదండ్రులు బిక్కుబిక్కుమంటూ పంపుతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజనం వంటే వాళ్లకు కోతుల బెడదతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సంబంధిత అధికారులు చొరవ చూపి కోతుల బెడద లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.


కోతుల భయంతో పాఠశాలలో బెత్తం పట్టుకున్న విద్యార్థులు

## హరీశ్‌రావు, కేటీఆర్‌లను విమర్శిస్తే సహించం


సిద్దిపేటలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, సెప్టెంబర్ 25 : హరీశ్‌రావు, కేటీఆర్ లాంటి పెద్ద నాయకులను తిడితే తాను పెద్దవాడిని అవుతాననే మూర్ఖత్వంలో మైనంపల్లి హనుమంతరావు ఉన్నాడని బీఆర్ఎస్ నాయకులు ఎడ్ల సోమిరెడ్డి, ఎల్లారెడ్డి అన్నారు. హరీశ్‌రావు, కేటీఆర్‌లపై మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సిద్దిపేట జిల్లా కేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ నాయకులు నిరసన చేపట్టారు. ఇప్పటికైనా మైనంపల్లి హనుమంతరావు కార్యకర్తలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకోవాలని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు పాల సాయిరాం, లింగం గౌడ్, ఆంజనేయులు, నరేశ్‌గౌడ్, బెదురు తిరుపతి, ప్రశాంత్ రెడ్డి, యాదగిరి, మహిపాల్ గౌడ్, వేణు, ఆకుబత్తిని రాము, సాయిచరణ్ గౌడ్ పలువురు పాల్గొన్నారు.

## ఉచితంగా వర్మీ కంపోస్టు పిట్స్ ఏర్పాటు

అక్కన్నపేట, సెప్టెంబర్ 25 : లోడీ సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో మానోస్ యూనిదాస్ సహకారంతో ఉచితంగా 100 వర్మీ కంపోస్టు పిట్స్ ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ బాలశౌరి తెలిపారు. బుధవారం మండలంలోని కేశనాయక్‌తండా, లచ్చుతండా, మబ్బుకుంటతండా, చౌటకుంట తండా, బోరింగ్‌తండా, పంచరాయితండా, డేక్యాతండా, చౌవుడుతండా, బోదర్‌వాగుతండా, మంజ్యాతండా, మైసమ్మ వాగుతండాలో చేపట్టిన వర్మీకంపోస్టు నిర్మాణాలను పరిశీలించారు. కంపోస్టులో తయారైన సేంద్రియ ఎరువులను పంటలకు వాడినట్లు అయితే అధిక దిగుబడి వస్తుందన్నారు. మండల ఫీల్డ్ కో-ఆర్డినేటర్ కోడం సత్యనారాయణ, సిబ్బంది రవీందర్, బిచ్చు, తిరుమల, రమేశ్, ఆయా తండాల గిరిజన రైతులు పాల్గొన్నారు.




కేశనాయక్‌తండాలో ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్టు పిట్స్‌ను పరిశీలిస్తున్న బాలశౌరి

## అంబరాన్నంటిన 'ఫ్రెషర్స్ డే' సంబురాలు

మద్దూరు(ధూళిమిట్ట), సెప్టెంబర్ 25 : మద్దూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన 'ఫ్రెషర్స్ డే' సంబురాలు అంబరాన్నంటాయి. కళాశాలలో ప్రథమ సంవత్సరంలోకి ప్రవేశించిన విద్యార్థులకు ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు తమ ఆట, పాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్య అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఎంతో ప్రధానమైనదన్నారు. విద్యార్థులు కష్టపడి చదవి తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు ప్రతిష్టలను తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కంఠారెడ్డి జనార్దన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి 'పండిత పరిషత్' కృషి

మద్దూరు(ధూళిమిట్ట), సెప్టెంబర్ 25 : విద్యారంగ సమస్యల పరిష్కారానికి, భాషలను బోధించే ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణకు రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ (ఆర్‌యూపీపీటీ) కృషి చేస్తున్నదని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుళ్లపల్లి తిరుమల కాంతికృష్ణ అన్నారు. బుధవారం మద్దూరు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన హిందీ భాషా పాఠశాల సముదాయ సమావేశంలో కాంతి కృష్ణ పాల్గొని మాట్లాడారు. తమ సంఘం చేసిన పోరాట ఫలితంగానే ఎనిమిదివేలకు పైగా భాషాపండితులకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి లభించిందన్నారు. రోష్టర్ కారణంగా ఇంకా కొంతమంది ప్రమోషన్ పొందలేదని, వారికి ప్రమోషన్ లభించేంత వరకు తమ సంఘం ప్రయత్నాలు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా పలువురు హిందీ భాషా బోధకులు ఆర్‌యూపీపీటీ సభ్యత్వాలను స్వీకరించారు. అనంతరం కాంతికృష్ణను హిందీ ఉపాధ్యాయులు శాలువతో సన్మానించారు. స్కూల్ కాంపెక్స్ హెచ్‌ఎం చంద్రశేఖర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శకుంతల. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కాంతికృష్ణను సన్మానిస్తున్న హిందీ ఉపాధ్యాయులు

## రక్తదానం చేసిన ఉపాధ్యాయుడికి అభినందన వెల్లువ

దుబ్బాక,సెప్టెంబర్ 25 : దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటకు చెందిన ఇస్తారిగల్ల పవన్ ప్రస్తుతం దుబ్బాక మండలం బల్వంతాపూర్‌లోని ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం సిద్దిపేట సురభి మెడికల్ దవాఖానలో రక్తం అత్యవసరం ఉన్న ఓ రోగికి పవన్ రక్తదానం చేశారు. నేటితో పవన్ 30 మందికి రక్తదానం చేసినట్లు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న దుబ్బాక ఎంఈవో ప్రభుదాస్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రత్యేకంగా అభినందించారు.

## వైభవంగా ఆర్ద్రా మహోత్సవం

కొండపాక(కుకునూరుపల్లి), సెప్టెంబర్ 25 : కొండపాక మండలంలోని మర్పడగలోని విజయదుర్గా సమేతా సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో బుధవారం క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో ఆర్ద్రామహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంతాన మల్లికార్జునస్వామికి సంతాన పాశుపత అభిషేకం నిర్వహించడంతో పాటు విజయదుర్గామాతకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం సంతాన పాశుపాత హవనం, పూర్ణహుతి నిర్వహించడంతో పాటు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితులు మోహనకృష్ణశర్మ, వేదవ్యాస్ శర్మ, లక్ష్మణరావు, క్షేత్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# గురువులను జీవితాంతం గుర్తు పెట్టుకుంటాం..

**మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు**

సిద్దిపేట, సెప్టెంబర్ 25 : విద్య అనేది ప్రభుత్వ.. ప్రైవేటు అని తేడా లేదు. పిల్లలు గురువును గురువులాగే చూస్తారు తప్పా ప్రైవేటు పాఠశాల గురువు ప్రభుత్వ పాఠశాల గురువు అని చూడరు.. వారికి విద్యాబుద్ధులు నేర్పించిన గురువును జీవితాంతం గుర్తు పెట్టుకుంటారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బుధవారం ట్రెస్మా ఆధ్వర్యంలో సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గురువందనం కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజరై మాట్లాడారు. దురదృష్టశాత్తుతో ఈ మధ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రైవేటు ఉపాధ్యాయులకు చదువు రాదు అని.. ప్రైవేటు ఉపాధ్యాయులను చాలా తక్కువ చేసి మాట్లాడారన్నారు. 25 లక్షల మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదివితే 35 లక్షల మంది పిల్లలు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నారన్నారు. ముఖ్యమంత్రిగా మీరు ప్రభుత్వ పాఠశాలలు మెరుగుపర్చండి కానీ ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మంచి మార్కులు తెచ్చినందుకు సిద్దిపేట జిల్లాకు మంచి పేరు వచ్చిందన్నారు. ప్రపంచ దేశాల్లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పెద్ద పెద్ద ఉద్యోగాల్లో తెలుగువారు అద్భుతంగా రాణిస్తున్నారన్నారు. ట్రెస్మా 2003లో ఉద్యమంలో పుట్టిన సంస్థ అన్నారు. పాపిరెడ్డి నాయకత్వంలో ఎంతో అద్భుతంగా తెలంగాణ ఉద్యమంలో పనిచేసేదని.. తెలంగాణ రాష్ట్ర సాధన అనంతరం అభివృద్ధిలో కూడా పనిచేశారన్నారు. ఇప్పటికే స్కూళ్లలో డ్రగ్స్ మహమ్మారి వచ్చేస్తుంది కాబట్టి ఉపాధ్యాయులు జాగ్రత్తగా ఉండాలన్నారు. మొబైల్ యాక్టివేట్ పెరిగి విద్యార్థులు ఫిజికల్ యాక్టివిటీ తగ్గిపోయిందని.. కాబట్టి ఫిజికల్ యాక్టివిటీ కూడా పెంచే విధంగా కృషి చేయాలన్నారు. ట్రెస్మా ప్రతినిధి సంజీవరెడ్డి, పలువురు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు

## అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ అధికారుల విచారణ

మద్దూరు (ధూళిమిట్ట), సెప్టెంబర్ 25 : 'అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్లు' అనే కథనం 'నమస్తే తెలంగాణ దినపత్రిక'లో బుధవారం ప్రచురితం కావడంతో ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. చేర్యాల మండలంలోని కమలాయపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని చేర్యాల ఐసీడీఎస్ సీడీపీవో రమాదేవి సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న కోడిగుడ్లు, కంది పప్పు తదితర సరుకులను గ్రామస్తుల సమక్షంలో ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. పిల్లలకు అందించే పౌష్టికాహారం విషయం లో రాజీపడేది లేదన్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంపై కొంతమంది గ్రామస్తులు చేసిన ఆరోపణలలో వాస్తవం లేదన్నారు. ఈ విషయాన్ని పలువురు గ్రామస్తులు తమ విచారణలో తెలియజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.


కమలాయపల్లిలో విచారణ చేపట్టిన సీడీపీవో రమాదేవి

## రాష్ట్ర స్థాయి క్రికెట్ జట్టుకు దుద్దెడ యువకుడు ఎంపిక

కొండపాక (కుకునూరుపల్లి), సెప్టెంబర్ 25 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో నిర్వహించిన అండర్-19 రాష్ట్ర స్థాయి క్రికెట్ సెలక్షన్‌లో కొండపాక మండలంలోని దుద్దెడకు చెందిన అనంతుల గణేశ్ ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. దీంతో క్రికెట్‌లో సత్తా చాటి రాష్ట్రస్థాయికి ఎంపికవడంపై అతడి తల్లిదండ్రులు అనంతుల నరేందర్-పద్మలతో పాటు అతని స్నేహితులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.


ఎంపికైన అనంతుల గణేశ్

## మాటల్లో పెట్టి.. గొలుసు లాక్కెళ్లి

సిద్దిపేట టౌన్, సెప్టెంబర్ 25 : ఇల్లు అద్దెకు కావాలని వృద్ధురాలిని మాటల్లో పెట్టి బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన సిద్దిపేట టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పరిధిలోని నర్సాపూర్ చెందిన కోరె సత్తెవ్వ ఇంట్లో ఒంటరిగా ఉండడాన్ని గమనించిన దొంగ ఇల్లు కిరాయికి దొరుకుతుందని సత్తెవ్వను అడిగాడు. లేదు అని చెప్పింది. దాహంగా ఉంది మంచి నీళ్లు కావాలని అడిగాడు. నీళ్లు తాగిన దొంగ ఒక సారిగా వృద్ధురాలపై దాడికి దిగి మెడలో ఉన్న సుమారు 4 తులాల బంగారు గొలుసును లాక్కొని డోర్ పెట్టి పారిపోయాడు. సత్తెవ్వ గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు వచ్చి డోర్ తీశారు.బాధితురాలు కొడుకు ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## బీడీ కార్మికులకు న్యాయం చేయాలి

సిద్దిపేట టౌన్, సెప్టెంబర్ 25 : బాషా బీడీ కంపెనీని మూసివేస్తున్నామని ప్రకటించిన నేపథ్యంలో కార్మికుల పక్షాన హెచ్ఎంఎస్ బీడీ కార్మిక సంఘం, ఇతర సంఘాలు న్యాయం కోసం సిద్దిపేట అసిస్టెంట్ లేబర్ కమిషనర్ శ్రీనివాస రావు, బీడీ కంపెనీ యాజమాన్యంతో బుధవారం చర్చలు జరిపారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో కార్మికుల డిమాండ్లను లేబర్ కమిషనర్, యజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. ఈ నెల 30న మరోసారి చర్చలను జరపనున్నట్లు జిల్లా హెచ్ఎంఎస్ అధ్యక్షుడు ఇదారి మల్లేశం పేర్కొన్నారు. హెచ్ఎంఎస్ జాతీయ కార్యదర్శి సుదర్శన్ రావు,నేతలు మధు,లక్ష్మణ్ పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్

గజ్వేల్, సెప్టెంబర్ 25: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మరిచిపోయిందని బీఆర్ఎస్ నాయకులు కళ్యాణ్‌కర్ నర్సింగరావు అన్నారు. బుధవారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ కల్యాణలక్ష్మి తులం బంగారం ఊసే లేదని ప్రభుత్వం ఇచ్చిన హామీలపై దృష్టి సారించడం లేదన్నారు. తొమ్మిది నెలలుగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఇవ్వడం లేదన్నారు. అబద్దపు హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యను పరిష్కారించడంలో చొరవ చూపాలన్నారు. నాయకులు శ్రీను, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

## జీవో 25ను నిలుపుదల చేయాలి

వర్గల్, సెప్టెంబర్ 25 : ఉపాధ్యాయుల సర్దుబాటు పేరిట అశాస్త్రీయమైన నిబంధనలతో రూపొందించిన జీవో 25ను వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం ఎస్టీయూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు నల్లా బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, మెహినోద్దీన్ మాట్లాడుతూ జీవో 25ను అమలు చేయడంతో ప్రాథమిక విద్యారంగం నిర్వీర్యంగా మారే అవకాశం ఉందన్నారు.



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

## శానిటరీ జవాన్లను అభినందించిన మున్సిపల్ చైర్‌పర్సన్

సిద్దిపేట, సెప్టెంబర్ 25 : చిన్నారిని గుర్తించి తల్లిదండ్రుల వద్దకు చేర్చిన శానిటరీ జవాన్లను మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులా రాజనర్సు అభినందించారు. వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణ కోమటి చెరువు పరిసర ప్రాం తాలకు చెందిన మూడేండ్ల పాప పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్ ఆవరణలో కూర్చొని ఏడవడాన్ని మున్సిపల్ జవాన్లు భానుశివ, మల్లేశం గమనించారు. పాప ఏమి చెప్పలేక పోయింది. ఆ క్రీడా ప్రాంగణంలోకి వచ్చిన మరో పాప ఆ చిన్నారిని గుర్తుపట్టి వారి అమ్మ తమ ఇంటి ప్రక్కన ఇంటిలో పని చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తుందని తెలుపగా, వెంటనే జవాన్లు అట్టి ఇంటి యజమాని వద్దకు పాపను తీసుకువెళ్లారు. పాప తండ్రి ఫోన్ నెంబర్ సేకరించి ఫోన్ చేసి రప్పించి ఆ పాపను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. దీనితో ఆ పాప తల్లిదండ్రులు మున్సిపల్ శానిటరీ జవాన్లకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎంఈవోకు సన్మానం..

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), సెప్టెంబర్ 25 : రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వు మేరకు అక్బర్‌పేట-భూంపల్లి మండల నూతన ఎంఈవోగా అంజాగౌడ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఎంఈవో అంజగౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. కార్యక్రమంలో జడ్పీ పాఠశాల హెచ్‌ఎం ఎం.రాజేందర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఎంఈవో అంజాగౌడ్‌ను సన్మానిస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

## మంత్రి ఆదేశాలతో బ్రిడ్జి నిర్మాణానికి అంచనాలు

కోహెడ, సెప్టెంబర్ 25 : మండలంలో నాలుగు రోజుల క్రితం పర్యటించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను తంగళ్లపల్లి, శనిగరం గ్రామాల ప్రజలు ఇరు గ్రామాల మధ్య ఉన్న పిల్లి వాగుపై హైలెవెల్ వంతెన నిర్మించాలని కోరారు. వెంటనే సంబంధిత శాఖ అధికారులతో మంత్రి పొన్నం మాట్లాడారు. బుధవారం అధికారులు వచ్చి పిల్లి వాగుపై కొలతలు వేసి అంచనాలు వేశా రు. ఇరుగ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

సిద్దిపేట కమాన్, సెప్టెంబర్ 25 : కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ప్రకటించిన వరంగల్ రైతు డిక్లరేషన్‌ను వెంటనే అమలు పర్చాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు జస్వంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంఎస్ గార్డెన్లో బుధవారం చలో సిద్దిపేట సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రైతు సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. షరతులు లేకుం డా రూ.2 లక్షల రుణమాఫీతో పాటు, రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేల చొప్పు న రైతుతో పాటు కౌలు రైతులకు ఇవ్వాలన్నారు. పండించిన అన్ని పంటలకు రూ. 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ విధంగా రుణమాఫీ వర్తింపజేయాలని అన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘాల నాయకులు

## మరసం వార్షికోత్సవ సభను ఘనంగా నిర్వహిస్తాం

సిద్దిపేట టౌన్,సెప్టెంబర్ 25 : సిద్దిపేట విపంచి కళానిలయంలో ఈ నెల 29న జరిగే మంజీర రచయితల సంఘం 38వ వార్షికోత్సవ సభను ఘనంగా నిర్వహించాలని సంఘ వ్యవస్థాపకులు,ప్రముఖ కవి డాక్టర్ నందిని సిద్ధారెడ్డి,ప్రముఖ గాయకుడు,ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్,అధ్యక్షులు రంగాచారి,ప్రతినిధులు తీర్మానించారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో బుధవారం రాత్రి వార్షికోత్సవ సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. కవులు,కళాకారులు,సాహితి ప్రియులు,పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

## ఉత్తమ్ కుమార్ రెడ్డి కమిటీని రద్దు చేయాలి

మిరుదొడ్డి,(అక్బర్‌పేట-భూంపల్లి), సెప్టెంబర్ 25 : ఎస్సీలను విడదీసి రాజకీయ పబ్బం గుడపుకోవడానికి వేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కమిటీని సీఎం రేవంత్ రెడ్డి వెంటనే రద్దు చేయాలని ఎస్సీ, వర్గీకరణ వ్యతిరేక కమిటీ సిద్దిపేట జిల్లా కన్వీనర్ ర్యాకం శ్రీరాములు, జిల్లావర్కింగ్ ప్రెసిడెంట్ మండల యాదగిరి డిమాండ్ చేశారు. బుధవారం అక్బర్‌పేట-భూంపలి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కమిటీ రద్దు చేయకుంటే నాడు చంద్రబాబు నాయుడుకు పట్టిన గతే సీఎం రేవంత్‌రెడ్డికి పడుతుందని హెచ్చరించారు. మాలలను ఇబ్బందులకు గురి చేసి పార్టీలకు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో మాల మహానాడు నాయకులు జక్కుల రాజయ్య, సుమన్, రమేశ్, చంద్రం, రమేశ్, నర్సింహులు, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ర్యాకం శ్రీరాములు

## మూడోరోజుకు చేరిన భూనిర్వాసితుల ధర్నా

వర్గల్, సెప్టెంబర్ 25 : మండలకేంద్రమైన వర్గల్, అవుసులోనిపల్లి, నగరంతాండ గ్రామాల భూనిర్వాసితులు చేస్తున్న ధర్నా బుధవారం మూడోరోజుకు చేరింది. ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చి భూములు తీసుకోవాలని లేనట్లైతే మాభూములు మాకిచ్చేంతవరకు నిరవధిక పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.


ధర్నా చేస్తున్న భూనిర్వాసితులు

## చినుకు పడితే చిత్తడే..

వర్గల్,సెప్టెంబర్25: వర్గల్ మండలకేంద్రంలోని ప్రధాన రహదారి వాన పడిందంటే చాలు చిత్తడి, చిత్తడి కావల్సిందే. అసలే గుంతలు పడిన రోడ్డు వరదనీటితో వచ్చిపోయే వాహనాలు దిగబడుంతుందో, ఏడ దిగబడుతుందో తెలియక బిక్కు బిక్కుమంటూ ప్రయాణం సాగిస్తున్నాయి. ముఖ్యంగా తహసీల్ ముందున్న రోడ్డు వరదనీటతో చిన్నపాటి చెరువు, కుంటను తలపిస్తుంది. పైకాలనీ నుంచి వరదనీటి ప్రవాహనం ఎక్కువైనప్పుడు తహసీల్ ముందు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో కార్యాలయానికి పనిమీద వచ్చే వివిధ గ్రామాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పట్టించుకొని వెంటనే మరమ్మతులు చేపట్టాలని వర్గల్ గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.


వర్గల్ తహసీల్ ఎదుట పారుతున్న వరద

## మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

కొండపాక(కుకునూరుపల్లి), సెప్టెంబర్ 25 : మద్యానికి బానిసై పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, సిద్దిపేట ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందు తూ మృతి చెందిన సంఘటన బుధవారం అంకిరెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తు లు తెలిపిన వివరాల ప్రకారం.. అంకిరెడ్డిపల్లికి చెందిన తాళ్లపల్లి పరశురాములు (40) ఆటోడ్రైవర్. ఏడాది నుంచి మద్యానికి బానిసై పని చేయకుండా తిరుగుతూ 20 రోజుల కింద భార్యను కొట్టడంతో పుట్టింటికి వెళ్లింది. ఈ నెల 21న వ్యవసాయ బావి వద్దకు వెళ్లిన పరశురాములు పురుగుల మం దు తాగడంతో చుట్టుపక్కల వారు సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ విషమించి బుధవారం మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## కాలువలో పడి వ్యక్తి మృతి

గజ్వేల్, సెప్టెంబర్ 25 : మండల పరిధిలోని దాతర్‌పల్లి సమీపంలోని కాళేశ్వరం కాల్వలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్లితే.. జగదేవ్‌పూర్ మండలం అలిరాజ్‌పేట గ్రామానికి చెందిన కందుకూరి కిష్టయ్య(58) కొండపోచమ్మ సాగర్‌లోకి నీళ్లు వెళ్లే కాల్వలో పడి మృతి చెందాడు. దాతర్‌పల్లి గ్రామస్తులకు కనిపించడంతో వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించగా, వెంటనే అక్కడికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి దర్యాప్తు చేస్తున్నారు.

## పరిస్థితి విషమించి మహిళ మృతి

కొండపాక(కుకునూరుపల్లి), సెప్టెంబర్ 25 : అనారోగ్యంతో బాధపడుతూ మహిళ మృతి చెందిన సంఘటన కొండపాక మండలంలోని అంకిరెడ్డిపల్లిలోచోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంకిరెడ్డిపల్లికి చెందిన తేలు మహేశ్వరి (40) ఈ నెల 19న జ్వరంతో బాధపడుతూ చికిత్స కోసం దుద్దెడలో ఆర్ఎంపీ ఆంజనేయులు వద్దకు రాగా, అతను ప్రథమ చికిత్స నిర్వహించి సిద్దిపేటకు తీసుకువెళ్లామని సూచించారు. సిద్దిపేటలోని ఒక ప్రైవేటు దవఖానకు తరలించగా, మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి వంటిమామిడి ఆర్‌వీఎం దవఖానకు తరలించారు. దీంతో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందింది. బుధవారం భర్త నర్సింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దంత పరీక్షలు

ములుగు, సెప్టెంబర్ 25 : మండల కేంద్రం ములుగులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దంత పరీక్షలు నిర్వహించారు. గజ్వేల్‌లోని లక్ష్మీశ్రీనివాస డెంటల్ దవాఖానకు చెందిన వైద్యులు పాఠశాలలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి 325 మంది విద్యార్థులకు దంత పరీక్షలు చేసి దంతాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, లయన్స్‌క్లబ్ సభ్యులు, విద్యార్థులు ఉన్నారు.

## జేఏసీ సమావేశానికి తరలిన మల్లన్న ఆలయ ఉద్యోగులు

చేర్యాల, సెప్టెంబర్ 25 : రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలైన యాదగిరిగుట్ట, వేములవాడ, బాసర, కొండగట్టు, భద్రాచలం, కొమురవెల్లి 6ఏ టెంపుల్స్‌లో విధులు నిర్వహిస్తున్న అర్చకులు, ఉద్యోగులు సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలనే డిమాండ్‌తో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిక్షేత్రంలో నిర్వహించిన దేవాలయాల జేఏసీ సమావేశానికి శ్రీ మల్లికార్జున స్వామి వారి దేవస్థాన ఉద్యోగులు, అర్చకులు బుధవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా కొమురవెల్లి ఆలయ అర్చకులు, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పడిగన్నగారి ఆంజనేయులు మాట్లాడారు. దేవాలయ ఉద్యోగులకు 888 జీవోను వెంటనే సవరించాలని, పెన్షన్ ఫండ్ డిపాజిట్ చేయాలని, ప్రభుత్వం హెల్త్‌కార్డులు మంజూరు చేయాలన్నారు.

## ఎంఈవోగా రంగనాయక్ బాధ్యతల స్వీకరణ

అక్కన్నపేట, సెప్టెంబర్ 25 : మండలంలోని మల్లంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మండల నోడల్ అధికారి గుగులోతు రంగనాయక్ బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవోగా బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఎంఈవోగా బాధ్యతలు చేపట్టిన రంగనాయక్‌ను పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## సమస్యలు పరిష్కరించాలి

చేర్యాల, సెప్టెంబర్ 25 : చేర్యాల ప్రాంతంలో నెలకొన్న రోడ్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు ఆధ్వర్యంలో బుధవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చేర్యాల నుంచి నాగపురి వెళ్లే రోడ్డును, చేర్యాల నుంచి జనగామ జిల్లా తరిగొప్పుల, మద్దూరు రోడ్లను రెండు లైన్ల రోడ్లుగా మార్చాలని కోరారు. చేర్యాల నాగపురి రహదారిలో రోడ్డు ఇరుకుగా ఉండడంతో కడవేర్గు సమీపంలో రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాతపడినట్లు మంత్రికి తెలిపారు. దీనికి స్పందించిన మంత్రి వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం నూతన టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌ను కలిసి ఆయనను సన్మానించారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు భాస్కర్‌రెడ్డి, ఉడుముల బాల్‌రెడ్డి, ఎండీ ఖాజా, సైకం రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## పత్తి పంట వ్యవసాయ క్షేత్ర ప్రదర్శన

చేర్యాల, సెప్టెంబర్ 25 : జననీ సీడ్స్ పత్తి విత్తనాలతో రైతులు అధిక దిడుబడులు సాధించవచ్చని జననీ సీడ్స్ జోనల్ మేనేజర్ పూల శివ కోటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని కమలాయపల్లి గ్రామ పాగాల నర్సింహరెడ్డి రైతు పొలంలో 400 మంది రైతులతో వ్యవసాయ క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ మేనేజర్ మాట్లాడుతూ ఆకాశ్ బిజీ వర్షాభావ పరిస్థితులను తట్టుకొని మంచి దిగుబడి ఇస్తుందన్నారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ వాస శంకర్‌రావు, డిస్ట్రిబ్యూటర్ మాత భువనేశ్వరి సీడ్స్ అండ్ పెస్టిసైడ్ సిద్దిపేట డీలర్ సతీశ్, ఏరియా మేనేజర్ నీరుడి కనకయ్య, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌కు వినతి

అక్కన్నపేట, సెప్టెంబర్ 25 : మండల కేంద్రంలోని తహసీల్‌లో బుధవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు తహసీల్దార్ అనంతరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలోని జీవో 25ను సవరించాలని కోరుతూ ఎస్‌జీటీ ఉపాధ్యాయులం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయులు కనుకయ్య, మల్లేశం, స్వామి, జంగపల్లి వెంకటనర్సయ్య, శంకర్, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఈవోల బాధ్యతల స్వీకరణ

మద్దూరు (ధూళిమిట్ట), సెప్టెంబర్ 25 : మద్దూరు, ధూళిమిట్ట ఎంఈవోలుగా వరదరాజులు, మాడిశెట్టి మీనాంజనేయులు బుధవారం మద్దూరు, ధూళిమిట్ట ఎంఆర్సీ కేంద్రాల్లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో విద్యాభివృద్ధికి శాయశక్తుల కృషి చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కాగా ఎంఈవోలుగా బాధ్యతలు స్వీకరించిన వరదరాజులు, మీనాంజనేయులులను పలువురు ఉపాధ్యాయులు, సీఆర్పీలు ప్రత్యేకంగా అభినందించారు.